# విషాద వలయం

పది రోజుల వ్యవధిలో నక్సలైట్లు పోలీసుల చేతిలో 30 మందికి పైగా చనిపోవడం గతంలో ఎన్నడూ జరగలేదు.

కాశ్మీర్‌లోనూ, గతంలో పంజాబులోనూ అటువంటి వార్తలు విన్నాము కానీ ఆంధ్రప్రదేశ్‌లో ముప్పై సంవత్సరాల నక్సలైట్ ఉద్యమ చరిత్రలో ఇంత పెద్ద సంఖ్యలో చావులెప్పుడూ సంభవించలేదు.

పెద్దఎత్తున హత్యలెప్పుడు జరిగినా బలాబలాల చర్చ చేయడం పత్రికలకు పరిపాటి అయింది. పత్రికలకే కాదు, సమాజానికి కూడ అయిందేమో. అంతకంటే చర్చించడానికి ఏముందని 'సినికల్'గా అనే వాళ్లు కూడ ఉంటారు.

వేరే ఏది కాకున్నా, ఇరుపక్షాల వ్యూహ ప్రతివ్యూహాలు హింసను ఒక వలయంగా పెంచుతున్న సంగతి చర్చనీయమే. ఎందుకంటే అందులో చనిపోతున్నది రెండు వైపులా అట్టడుగు వర్గాల వారే. సాయుధ పోరాటం ద్వారానే శ్రామిక రాజ్యాధికారం నెలకొంటుందని నక్సలైట్లు మొదటి నుండి నమ్ముతున్న మాట వాస్తవమే గానీ వాళ్ల సాయుధ పోరాటం ఎప్పుడూ ఒకే స్థాయిలో లేదు. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత కొన్నేళ్లు వాళ్లు ప్రజాసంఘాలు పెట్టి విస్తృతంగానే ప్రజా ఉద్యమాలు నడిపే ప్రయత్నం చేశారు.

అప్పట్లో పోలీసు యంత్రాంగం చాలా నిస్సిగ్గుగా పెత్తందారీ వర్గాల పక్షం వహించింది. సాయుధ పోరాటం గురించి మాట్లాడడమే

తప్ప ఆయుధాలు పెద్దగా పట్టి ఎరుగని రైతుకూలీ కార్యకర్తలను క్రూరంగా అణచివేసారు. వరంగల్, కరీంనగర్ వంటి జిల్లాలలో ప్రజల చేత 'రాక్షసులు' అని పిలిపించుకోవడాన్ని సిగ్గుపడవలసిన విషయంగా కాక గొప్పతనంగా భావించిన పోలీసు అధికార్లున్నారు.

1985 తరువాత నక్సలైట్ల హింస పెరిగింది. భూస్వాములనేకాక పోలీసులనూ చంపడం మొదలుపెట్టారు. పోలీసులు 'ఎన్‌కౌంటర్లు' పెంచారు. నక్సలైట్ల 'ఏరివేత' కోసం ప్రత్యేకంగా ఏర్పాటయిన పోలీసు దళాలు చిత్రహింసలలో కొత్త పద్ధతులనూ కొత్త క్రూరత్వాన్నీ ఆవిష్కరించాయి.

నక్సలైట్ల హింసలోనూ క్రూరత్వం పెరిగింది. దుర్మార్గులయిన ప్రజాపీడకుల కంటే ఇన్‌ఫార్మర్లను చంపడం ఎక్కువయింది. ఆయుధాల వాడకం పెరిగింది. 'ఇన్‌ఫార్మర్ల'ను చంపటమే కాక అతి క్రూరంగా చేతులు కాళ్లు తెగ నరికి అవిటివాళ్లను చేసి విడిచిపెట్టడం - బహుశా శత్రువులు కాగల వారికి ఒక సజీవమైన హెచ్చరికగా మిగల్చడం కోసమేమో - 1990 దాకా తరచుగా జరిగేది.

రెండు వైపులా ఆయుధాల ఆధునికత పెరిగింది. ఆటోమెటిక్ తుపాకులు, వైర్‌లెస్ పరికరాలు, మందుపాతరలు, శక్తివంతమైన గ్రెనైడ్‌లు, వేగంగా కదిలే వాహనాలు, వీటికి తగినట్టు సైన్యం తరహా వ్యవహారశైలి - దాదాపు 10 సంవత్సరాలుగా ఈ చిత్రం మరింత సంపూర్ణమైన రూపం తీసుకోవడం చూస్తున్నాం.

నక్సలైట్ పార్టీల సిద్ధాంతం దృక్పథంలో ఈ ఘర్షణ ఎప్పుడూ వర్గ పోరాటమే. జాగ్రత్తగా విశ్లేషిస్తే అది రాజ్యానికీ దాని సార్వభౌమత్వాన్ని గుర్తించ నిరాకరించే ప్రత్యామ్నాయ సాయుధ శక్తికీ మధ్య పోరాటం. అయితే ఈ ప్రత్యామ్నాయ సాయుధ శక్తి తన సైనికులుగా ఎంచుకున్నది సమాజంలోని అట్టడుగు వర్గాలకు చెందిన వారు కావడంతో ఈ వైరానికి వర్గ సంఘర్షణ లక్షణాలున్నాయి. ఆ శక్తి కాపాడ తలపెట్టిన ప్రయోజనాలు కూడ ఎక్కువగా ఆ వర్గాలవే. కానీ రాజ్యం అదే పేద వర్గాల నుండి తన మద్దతుదార్లను తయారు చేసుకునే కొద్దీ నక్సలైట్ల హింస వారి పైననే ఎక్కుపెట్టే పరిస్థితి ఏర్పడింది. రాను రాను పెరిగింది. ఆ క్రమంలో నక్సలైట్లకూ రాజ్యాంగ యంత్రానికీ మధ్య నడుస్తున్న పోరుకు ఉన్న వర్గ పోరాట లక్షణమూ క్షీణించింది. నక్సలైట్ల చేతిలో చస్తున్న వారిలో అత్యధికులు సిద్ధాంత రీత్యా ఆ ఉద్యమం పునాది అయిన వర్గాలకు - లేదా తటస్థంగా ఉండవలసిన మిత్ర వర్గాలకు - చెందిన వారే. గతితార్కిక స్థితప్రజ్ఞత గలవాళ్ల సంగతేమో కానీ మామూలు మానవులకు ఇది ఆందోళన కలిగించక తప్పదు. రాష్ట్రమంతటా

ఎక్కువగా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండే లంబాడా గిరిజనులను నిజామాబాద్ జిల్లాలో పీపుల్స్‌వార్ చెప్పుకోదగ్గ పరిమాణంలో వామపక్ష రాజకీయాల వైపు తీసుకు రాగలిగింది. కానీ మొన్నటి మర్రిమడ్ల ఘటనలో లంబాడాలనే ఎక్కువ సంఖ్యలో చంపింది.

రాజ్యానికి మద్దతుదార్లుగా మారే పేదలందరూ వామపక్షవాదులు మామూలుగా ప్రయోగించే చెడు అర్థంలో 'రాజ్యం ఏజెంట్లు' కారు. అటువంటి వారు - అంటే ఏవో ప్రయోజనాలకు ఆశపడి పోలీస్ ఇన్‌ఫార్మర్లుగానూ ఎం.ఎల్.ఏల కాల్బలంగానూ మారేవారు - కొందరుంటారు. కానీ ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని నిజాయితీగా విశ్వసించేవారు ఉంటారు, క్రమబద్ధమైన మార్పును నమ్ముకున్న వారు ఉంటారు, సంక్షేమ విధానాల వల్ల ప్రయోజనం పొంది పాలక పార్టీని అభిమానించేవారు ఉంటారు, తమ తప్పుల వల్లనో తప్పేమీ లేకుండానో నక్సలైట్లకు శత్రువులుగా మారి పోలీసుల పంచన చేరక తప్పని వారుంటారు, 'నక్సలైట్లకూ పోలీసులకూ మధ్య నలిగిపోయే' కన్నా ఏదో ఒక పక్షం ఎంచుకోవడం మేలన్న నిర్ణయానికి వచ్చి మొదటి దానికి సిద్ధంగా లేని కారణంగా రెండవ పక్షాన్ని ఎంచుకున్నవారు ఉంటారు, నక్సలైట్ల చర్యల వల్ల అన్యాయానికి గురై ప్రతీకారం కోసం పోలీసులకు దగ్గరయిన వారు ఉంటారు. వీరి మీద చేసే పోరాటమంతా 'వర్గపోరాటమే' నంటే నమ్మడం కొంచెం కష్టమే.

వ్యూహ ప్రతివ్యూహాల దగ్గరకు తిరిగి వస్తే, చంద్రబాబు నాయుడు పదవి చేపట్టిన తరువాత పరిస్థితి మరింత దిగజారిందని చెప్పుకోవాలి. అన్నింటికీ చంద్రబాబును నిందించడం ఫ్యాషన్ అయిపోయిందని విసుక్కునే వాళ్లు లేక పోలేదు. కాని అన్నిటికీ తిట్టించుకునే అర్హతగల మహాత్ములు చరిత్రలో అక్కడక్కడ తగులుతారు. చంద్రబాబు వారిలో ఒకడు. నక్సలైట్ ఉద్యమాన్ని అణచే విషయంలో పోలీసుల మనసులలో ఇంకా మిగిలి ఉన్న కోరికలన్నీ తీర్చుకోవడానికి కావలసిన పాలనా వాతావరణం అతని రాజ్యంలో లభించింది.

క్రమం తప్పకుండ ఈ రాజ్యంలో ప్రతీ సంవత్సరం 200 మందికి పైగా పోలీసుల చేతులలో ఎన్‌కౌంటర్ల పేరిట చనిపోతున్నారు. వారిని చంపే పోలీసులకు నగదు పారితోషికాలూ, త్వరిత ప్రమోషన్లూ లభిస్తున్నాయి. 'సైడ్ బిజినెస్'గా వారు ఎన్ని అడ్డదార్లు తొక్కినా ప్రభుత్వం వారినేమీ అనదు. చంపి చట్టాన్ని కాపాడే ఖాకీ హీరోల హింసకు ఇక్కడ సంపూర్ణమైన రక్షణ లభిస్తుంది. 'రౌడీలను చంపండి' అని ఒకరికి మించి ఒకరు ప్రజలను రెచ్చగొడుతున్న పోలీస్ ఆఫీసర్లు, రౌడీ షీటర్లను

కాలికింద తొక్కుతూ టీవీ కెమెరాలకు పోజులియ్యడానికి వెనకాడని పోలీస్ ఆఫీసర్లు ఈ సంగతి తెలిసే నడుచుకుంటున్నారు.

అయితే నక్సలైట్ ఉద్యమం విషయానికి వచ్చేసరికి బయటి నుండి ప్రయోగించే హింసను పెంచడం దగ్గర ఈ పతనం ఆగిపోలేదు. ఉద్యమాన్ని లోపలి నుండి తొలిచివేసే ప్రయోగాన్ని కూడ పోలీసు యంత్రాంగం చేపట్టింది. ఆ ఉద్యమం బాగుంటే ఇది సాధ్యమయ్యేది కాదు. ఆ సంగతి గ్రహించకుండా 'రాజ్యం ఎంతగా దిగజారింది' అంటూ రాజ్యం కుట్రే తమలోని ముసలానికి కారణమైనట్టు తిట్టి పోసే ఆ ఉద్యమ అభిమానుల వైఖరి విడ్డూరంగా అనిపించకమానదు.

అయినప్పటికీ ఒక ఉద్యమాన్ని ఎదుర్కొనడానికి దానిని లోపలి నుండి 'క్రిమినలైజ్' చేసే వ్యూహం చాలా భయంకరమైన పరిణామాలకు దారి తీయగలదు. ప్రజలలో విస్తృత ప్రభావం గల ఉద్యమాలను అంతర్గత సంక్షోభంలో పడేసే విధంగా లోపలి నుండి చిచ్చుపెట్టడం - దానికి అవకాశం ఆ ఉద్యమాల నుండే రానీగాక - సమాజానికీ ప్రజలకూ నష్టకరమని చంద్రబాబు స్థాయి రాజకీయ వేత్తలకు తోచకపోవచ్చు. అది సమాజాన్ని దిగజారుస్తుంది. రాజకీయ ఆచరణనూ ఆశయాలనూ దిగజారుస్తుంది. అదే క్రమంలో దీని వ్యూహకర్త అయిన రాజ్యాంగ యంత్రాన్నీ దిగజారుస్తుంది. డబ్బు చేసుకోవడం, చేసుకోవడానికి వెసులుబాటు కల్పించడం - ఇదే పరిపాలన అనుకునే వారికిది తోచకపోవడం సహజం. ఉద్యమాలు ఆరోగ్యంగా ఉండడం అందరికీ మంచిదనుకునే 'సంస్కారం' వారికెక్కడి నుండి వస్తుంది? వారి కుసంస్కారానికీ, దానిని ఎదుర్కొనే మార్గం తెలీక అది వేసే 'ట్రాప్'లోనే పదే పదే పడుతున్న నక్సలైట్ ఉద్యమం దృష్టిలోపానికీ మనం - ముఖ్యంగా తెలంగాణ ప్రజలు - చాలా మూల్యం చెల్లించవలసి రావచ్చు.

*నీహార్ ఆన్‌లైన్.కామ్*

*కచ్చితమైన తేదీ తెలియదు, ఏప్రిల్ 2000 కావొచ్చు*